సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 10 । మార్చి । 2023



దోపిడీ కేసులో నిందితురాలి అరెస్ట్

ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని చంపుతానని బెదిరించి బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన పనిమనిషిని గంటల వ్యవధిలోనే పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.56,940
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,086
3 శాతం జీఎస్టీతో	రూ.5,239
నవర (8 గ్రా)	రూ.41,912

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.5 /23.5

గురువారం గాలిలో 56 శాతం తేమ ఉంది. జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. శుక్రవారం వాతావరణంలో ఎలాంటి మార్పు ఉండదు.

న్యూస్‌రీల్

11, 12 తేదీల్లో 'విక్రమ సింహపురి' రద్దు

నెల్లూరు(సెంట్రల్): గూడూరు నుంచి విజయవాడకు వెళ్లే విక్రమ సింహపురి అమరావతి ఇంటర్‌సిటీ (12743) రైలు ఈనెల 11, 12వ తేదీల్లో రద్దు చేసినట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. అదే విధంగా విజయవాడ నుంచి గూడూరుకు వచ్చే ఇంటర్‌సిటీ (12744) రైలును కూడా అదే తేదీల్లో రద్దు చేసినట్లు తెలియజేశారు. వీటితోపాటు జనశతాబ్ది ట్రైన్‌ను కూడా ఆ తేదీల్లో రద్దు చేశారని, ప్రయాణికులు గమనించాలని కోరారు.

సోమశిలలో 58.764 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం నాటికి 58.764 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 2,100, ఉత్తరకాలువకు 473, దక్షిణకాలువకు 400, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.826 మీటర్ల నీటి మట్టం ఉంది.

సైనిక సంక్షేమ నిధికి మెప్మా విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)కు చెందిన నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు మున్సిపాలిటీల్లోని పొదుపు మహిళలు సైనిక సంక్షేమ నిధికి సమాఖ్యల ద్వారా విరాళాలు సేకరించారు. దీనికి సంబంధించి రూ.6,57,910ల చెక్కును గురువారం సాయంత్రం నెల్లూరులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మెప్మా పీడీ రవీంద్ర కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబుకు అందజేశారు. ఆయన సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్‌కు అందించారు. ఈ సందర్భంగా పొదుపు మహిళల ద్వారా భారీ విరాళం సేకరించిన మెప్మా అధికారులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో మెప్మా ఏఓ ప్రసాద్, ఐబీ వంకదారి అంకయ్య, సీఎంఎంలు కాంతయ్య, జరీనా, టీఎల్ఎఫ్ అధ్యక్షులు శైలమ్మ, సుహాసిని, కస్తూరి, బీబీ జాన్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వేలం ప్రారంభం

- కందుకూరులో తొలిరోజు కేజీ రూ.200 పలికిన ధర



ఒకటో కేంద్రంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కందుకూరు: ఈ ఏడాది పొగాకు వేలం గురువారం ప్రారంభమైంది. కందుకూరు–1, 2 వేలం కేంద్రాల పరిధిలో బోర్డు అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ ప్రక్రియను మొదలుపెట్టారు. రెండు కేంద్రాల పరిధిలో 27 బేళ్లను మొదటిరోజు వేలానికి ఉంచారు. కేజీ రూ.200 అత్యధిక ప్రారంభ ధరలో వేలం ప్రారంభమైంది. అదే ధరకు రెండు చోట్ల బేళ్లన్నింటిని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా బోర్డు ఇన్‌చార్జి కార్యదర్శి, వేలం మేనేజర్ డి.వేణుగోపాల్ మాట్లాడుతూ వ్యాపారులు రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలన్నారు. పలువురు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ రైతులకు నష్టాలు రాకుండా ఉండాలంటే సరాసరి ధర తగ్గకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రొడక్షన్ అండ్ రీజనల్ మేనేజర్ కృష్ణశ్రీ, బోర్డు సభ్యుడు బ్రహ్మయ్య, వేలం నిర్వహణాధికారి చైన్‌రామ్‌మీనా, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో నిమ్మ ధరలు



పొదలకూరు: నిమ్మ ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. తోటల్లో కాయలు ఉన్న రైతుకు మంచి ఫలసాయం అందుతోంది. ఉష్ణోగ్రతలు పెరగడంతో డిమాండ్ పెరిగింది. ఒక బస్తా రూ.6,800 నుంచి రూ.8 వేల వరకు ధర పలుకుతోంది. కిలోల వంతున చూసుకుంటే రూ.85 నుంచి రూ.100 ధర ఉందని వ్యాపారులు వెల్లడించారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల వారు పెరిగిన ధరలకు అనుగుణంగా కొనుగోలు చేయలేమంటున్నారు. ఉత్తర భారతదేశంలో మాత్రం ధరలను పెంచి కొనుగోలు చేస్తున్నారు.

రంగడి రథోత్సవం.. ఊరంతా సంబరం

రంగనాథుడి నామస్మరణతో పులకించిన సింహపురి



ఎదురుకోలోత్సవంలో భాగంగా విచ్చేస్తున్న లక్ష్మీనృసింహస్వామి, అమ్మవార్లు



రథంలో కొలువుదీరిన రంగనాథస్వామి, అమ్మవార్లు



గోపురం వీధిలో సాగుతున్న రథోత్సవం

- తరలివచ్చిన భక్తజనం
- ఉత్సవాన్ని ప్రారంభించిన నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు

నెల్లూరు(బృందావనం): రంగడి రథోత్సవంతో సింహపురి పులకించింది. ఉత్తర శ్రీరంగంగా భాసిల్లుతున్న తల్పగిరి దివ్యక్షేత్రం జై రంగ.. జైజై రంగ.. రంగనాథా రక్షమాం.. రంగనాథా పాహిమాం.. గోవిందా.. గోవిందా నామస్మరణతో మార్మోగింది. నెల్లూరులోని పినాకిని తీరాన రంగనాయకులపేటలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి రథోత్సవం గురువారం ఆద్యంతం నయనానందకరంగా భక్తుల కేరింతల నడుమ సుమారు ఐదుగంటలపాటు సాగింది. విశేష పుష్పాలంకరణలతో, శోభాయమానంగా తీర్చిదిద్దిన తిరుత్తేరుపై ఉభయదేవేరులతో కొలువైన రంగనాథుడిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తజనంతో గోపురం వీధి, రంగనాయకులపేట, రైలు వీధి, సంతపేట మాడవీధులు కిటకిటలాడాయి.

ఎమ్మెల్యే అనిల్ చేతుల మీదుగా..

రథోత్సవాన్ని నెల్లూరు నగర సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ ప్రారంభించారు. తొలుత స్వామికి అనిల్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయంలో మూలవర్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుమ్మడికాయ దిష్టితీసి రంగడి నామాన్ని స్మరిస్తూ రథం గొలుసులు లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు.

సాగిందిలా..

రథోత్సవం తూర్పు రాజగోపురం సమీపంలో ఉన్న రథమండపం నుంచి ఉత్తరమాడవీధి, తూర్పున ఉన్న గోపురంవీధి రైల్వేగేట్ వరకు.. అక్కడి నుంచి తిరిగి గోపురంవీధి, రంగనాయకులపేట, సంతపేట, నాలుగుకాళ్ల మండపం వరకు, అక్కడి నుంచి వెనుదిరిగి స్వామి సన్నిధి వద్ద ఉన్న రథమండపం వరకు వేడుకగా సాగింది.

వేడుకగా ఎదురుకోలోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంప్రదాయంగా నాలుగుకాళ్ల మండపం వద్ద ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీవేదగిరి లక్ష్మీనృసింహస్వామి రంగనాథస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే రంగనాథస్వామి ఉభయదేవేరులతో లక్ష్మీనృసింహస్వామికి పట్టువస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎదురుకోలోత్సవం వేడుకగా సాగింది. ఉభయదాతగా కొండేటి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ధర్మకర్తల మండలి చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, సభ్యులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో..

ఉభయదేవేరులతో అఖిలాండ బహ్మాండ నాయకుడు కొలువైన రథ చక్రాలపై భక్తులు ఉప్పు, మిరియాలు జల్లుతూ, మొక్కుబడిలో భాగంగా కొబ్బరికాయలు, గుమ్మడికాయలు కొట్టారు. రథోత్సవం సందర్భంగా ప్రథమంగా ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిత్యహోమం, మహానివేదన, బలిహరణం, పుణ్యాహవచనం స్వస్తివచనం, రథకుంభప్రోక్ష తదితర విశేష పూజలను నిర్వహించారు. ఉత్సవంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఇలపాక శివకుమార్ ఆచారి, కార్పొరేటర్ గుంజి విజయలక్ష్మి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు నాయకులు, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

- రథోత్సవం ఉభయకర్తలుగా అయితా సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన భార్య పద్మావతమ్మ, రథం పుష్పాలంకరణకు వై.విజయభాస్కర్‌రెడ్డి, స్వామి, అమ్మవార్ల పుష్పాలంకరణకు కొండ్రెడ్డి రంగారెడ్డి, కొండ్రెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి, ఇందిరా ప్రియదర్శిని, శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి పుష్పాలంకరణకు సంపతి హనుమంతరావు, గంగిశెట్టి గోపీ, పొన్నవాహన అలంకారోత్సవానికి సిద్ధవరపు రామలింగారెడ్డి, మధుసూదన్ రెడ్డి, సుమంత్‌కుమార్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.
- శ్రీరంగనాథ మిత్రమండలి, భజరంగ్‌దళ్, పలు హిందూ ధార్మిక సంస్థల నిర్వాహకులు, యువత, భక్తబృందాలు రంగడిని, గోవిందుడిని స్మరిస్తూ రథోత్సాహంతో ముందుకుసాగారు.
- ఉత్సవం సందర్భంగా స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంఘాలు తదితరులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసాదాలు, మజ్జిగ, శీతల పానీయాలు తదితరాలను అందజేశారు.
- బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాత్రి స్వామి పొన్నవాహన సేవలో భక్తులను అనుగ్రహించారు.

ప్రజలకు స్వామి ఆశీస్సులు ఉండాలి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రజలకు రంగనాథస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆకాంక్షించారు. రథోత్సవాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో మరింత ముందుకు వెళ్లాలని కోరుకున్నానన్నారు. ఈ సందర్భంగా ఆయన ది బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



రథం లాగుతున్న సిటీ ఎమ్మెల్యే అనిల్

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 7 గంటలకు అశ్వవాహన అలంకారోత్సవం జరుగుతాయని దేవస్థానం ఈఓ, చైర్మన్ తెలిపారు.



సంతపేట నాలుగుకాళ్ల మండపం వద్ద రథోత్సవం

ప్రశాంత పోలింగ్‌కు ఏర్పాట్లు



చక్రధర్‌బాబు, కలెక్టర్

'సాక్షి' ప్రతినిధితో కలెక్టర్ చక్రధర్‌బాబు

- 2016 కంటే 40 శాతం పెరిగిన ఓటర్లు
- 79 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు జరుగుతున్నాయని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. గురువారం ఆయన నెల్లూరులో 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. జిల్లా వ్యాప్తంగా 1,07,635 మంది పట్టభద్రులు 129 పోలింగ్ కేంద్రాల్లో, 8,165 మంది టీచర్ ఓటర్లు 40 పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును ఈనెల 13వ తేదీన వినియోగించుకోనున్నారు. ఇప్పటికే 97 శాతం ఓటర్ స్లిప్‌ల పంపిణీని జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. ఒకవేళ స్లిప్‌లు అందకున్నా పోలింగ్ కేంద్రాల వద్ద ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. 2016 ఎన్నికలతో పోల్చుకుంటే 40 శాతం ఓటర్లు పెరిగారు. జిల్లాలో 79 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాం. కాగా ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్, వీడియో తీసే ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి కేంద్రం వద్ద మైక్రో అబ్జర్వర్లతోపాటు 1+3 పోలింగ్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అధికారులు, ఉద్యోగులకు రెండు విడతల శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశాం. నియోజకవర్గ కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నాం. పోలింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను చిత్తూరులోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేలా చర్యలు చేపట్టాం.

- పోలింగ్ ప్రక్రియలో ఏడు ప్రత్యేక పోలీస్ బృందాలను వినియోగించనున్నాం. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అందజేశాం. ఇప్పటికి 30 మంది దీనిని వినియోగించుకున్నారు. కేంద్రాల వద్ద ఓటర్లకు అవగాహన కల్పించేందుకు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయనున్నాం.
- ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో బ్యాలెట్ పత్రంపై అంకెలను మాత్రమే వినియోగించాలి. అక్షరాలు నమోదు చేస్తే ఓటు చెల్లదు. ఓటర్లు మొదటి ప్రాధాన్యతా ఓటుకు 1 అంకెను తప్పనిసరిగా వినియోగించాలి. ఆ అంకె వేయకుండా 2, 3 వేస్తే అటువంటి ఓట్లు చెల్లుబాటు కావు. పోలింగ్ కేంద్రంలో సిబ్బంది ఇచ్చే పెన్‌ను మాత్రమే ఓటర్లు వినియోగించాలి. కేంద్రంలోకి ఓటర్లు పెన్, సెల్‌ఫోన్లు ఇతర వస్తువులను తీసుకురాకూడదు. ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకున్నాం.
- జిల్లాలోని ప్రతి మండలంలోనూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. పోలింగ్ కేంద్రాల వద్ద కోవిడ్ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తాం. నిబంధనలను అమలు చేసేందుకు డీఎంహెచ్‌ఓను నోడల్ ఆఫీసర్‌గా నియమించాం.
- జిల్లావ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు కోసం 1,150 మందిని నియమించాం. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అధికార యంత్రాంగం అన్ని విధాలా చర్యలు చేపట్టింది. పోలింగ్ సమయంలో ప్రజాప్రతినిధులు, ఓటర్లు అధికారులకు సహకరించాలి.

ప్రసన్నుని హుండీ కానుకల లెక్కింపు

- రాబడి రూ.17.93 లక్షలు

బిట్రగుంట: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ప్రసన్నుని బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీల్లో భక్తులు వేసిన కానుకలను గురువారం లెక్కించారు. రూ.17,93,811ల రాబడి వచ్చినట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో లెక్కింపు జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

గెలుపే లక్ష్యంగా..

జిల్లాలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల వేడి పెరిగింది. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ప్రచారజోరు మరింత పెంచారు. నాయకులు, ప్రజాప్రతినిధులు వారికి మద్దతుగా నిలిచారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోర పరాభవంతో మదనపడుతున్న టీడీపీ, బీజేపీలు ఈ ఎన్నికల్లో ఉనికి కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నాయి. ఇక పీడీఎఫ్ అభ్యర్థులు మాత్రం సోషల్ మీడియా వేదికగా అసత్యాలను ప్రచారం చేస్తున్నారు.

- హోరెత్తిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- దూకుడు పెంచిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- మద్దతుగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకుల ప్రచారం
- ఉనికి కోసం టీడీపీ, బీజేపీ పాకులాట
- అసత్య ప్రచారాలు చేస్తున్న పీడీఎఫ్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉమ్మడి ప్రకాశం – నెల్లూరు – చిత్తూరు జిల్లాలకు సంబంధించి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 13వ తేదీన జరగనున్నాయి. పోలింగ్‌కు మరికొద్ది రోజులే సమయం ఉండడంతో అభ్యర్థులు ఇంటింటా ప్రచారం ముమ్మరం చేశారు. ఇక ప్రచార పర్వంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు అండగా నిలుస్తున్నారు.

- ఈనెల 13న పోలింగ్ కావడంతో 48 గంటల ముందే అంటే శుక్రవారం సాయంత్రానికే మైకులు మూగబోతాయి. దీంతో ప్రచార వ్యవధి తక్కువ కావడంతో రాజకీయ పార్టీలు దూకుడు పెంచాయి.

బరిలో ఎందరున్నా..

గ్రాడ్యుయేట్స్‌కు సంబంధించి ప్రధానంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, పీడీఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి పోటీలో ఉన్నారు. ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల సంక్షేమ పాలనపై పట్టభద్రులు పూర్తి సంతృప్తిగా ఉన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ఏర్పాటు, జాబ్‌మేళాలు, పలు నోటిఫికేషన్ల ద్వారా లక్షలాది ఉద్యోగాలు కల్పించడంతో శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి వారు అండగా నిలుస్తారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇంకా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో గత సార్వత్రిక ఎన్నికల నుంచి స్థానిక సంస్థల ఎన్నికల వరకు వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయాలు సాధించింది. దీంతో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఓటమి తప్పదని భావిస్తూ టీడీపీ నామమాత్రంగా ప్రచారం నిర్వహిస్తోంది. మరోవైపు పీడీఎఫ్ అభ్యర్థి సోషల్ మీడియా వేదికగా అసత్యాలు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

వారి మద్దతు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు, అసోసియేషన్ల నాయకులు ప్రతి నియోజకవర్గంలో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. తాజాగా ప్రభుత్వం కూడా ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను త్వరలోనే చెల్లిస్తామని, టీచర్ల సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనకు టీచర్ల మద్దతు పెరిగింది.

పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ


సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జేసీ కూర్మనాథ్

• జేసీ కూర్మనాథ్

నెల్లూరు(అర్బన్): ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జేసీ కూర్మనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జేసీ తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 52,903 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్షల్లో కాపీయింగ్ జరగకుండా 4 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను, 5 సిటింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కంట్రోల్ రూమ్ నుంచి పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తామన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ఐఓ వరప్రసాదరావు, డీఎస్పీ గాంధీ, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆర్టీసీ డిపో మేనేజర్ శివకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ

• రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించిన కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని అన్ని డివిజన్లకు పంపిణీ చేశామని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి జేసీ కూర్మనాథ్, డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానమిస్తూ జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన ప్యాకింగ్, పంపిణీ సామగ్రిని సేకరించి పంపిణీ చేశామన్నారు. బ్యాలెట్ బాక్సులకు నంబర్లు వేసి డివిజన్లకు పంపామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు భద్రపరిచామని తెలిపారు. పోలింగ్ సామగ్రి, సిబ్బందిని తరలించేందుకు 24 బస్సులను, 4 డీజీటీ వాహనాలను సిద్ధం చేశామన్నారు. జిల్లాలో 169 పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, కరుణకుమారి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ఉత్సాహంగా మహిళా క్రీడా పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ నెల 8వ తేదీ నుంచి స్థానిక ఏసీ స్టేడియంలో మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. రెండోరోజు గురువారం మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. అథ్లెటిక్స్‌లో 100, 200, 400 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్, జావెలిన్ త్రో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్నల్ సీఈఓ పుల్లయ్య మాట్లాడుతూ నిత్యం పనిఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. వెటరన్ క్రీడాకారులు 125 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ యతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


షాట్‌పుట్‌లో పాల్గొన్న మహిళా ఉద్యోగి

దోపిడీ కేసులో నిందితురాలి అరెస్ట్

• రూ.4.90 లక్షల సొత్తు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని చంపుతానని బెదిరించి ఆమె ఒంటిపైనున్న బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన పనిమనిషిని గంటల వ్యవధిలోనే నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి రూ.4.90 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. స్టోన్‌హౌస్‌పేట ప్రకాష్‌నగర్‌లో కొడుకు, కోడలితో కలిసి నివాసం ఉంటున్న వృద్ధురాలు రాజారత్నంను వారి ఇంట్లో పనిచేస్తున్న పి.లక్ష్మి చంపుతానని బెదిరించి ఆమె ఒంటిపైనున్న రూ.4.90 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన విషయం తెలిసిందే. రాజారత్నం కోడలు గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు పరారీలో ఉన్న నిందితురాలు లక్ష్మిని గురువారం ప్రశాంతి నగర్ జంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు. దోపిడీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

ఎస్సై నియామకాన్ని రద్దు చేయడం తగదు

• అతన్ని ఉద్యోగంలోకి తిరిగి తీసుకోవాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఎక్సైజ్ చట్టం కింద నమోదైన ఓ కేసు వివరాలను పోలీసు ఉద్యోగ దరఖాస్తులో పేర్కొనకుండా గోప్యంగా ఉంచారంటూ ఎస్సైగా నియమితులైన విజయభాస్కర్ అనే వ్యక్తి నియామకాన్ని రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు తప్పుబట్టింది. విజయభాస్కర్‌పై నమోదైన కేసు చాలా చిన్నదని.. పైగా ఆ కేసులో కింది కోర్టు అతన్ని నిర్దోషిగా ప్రకటించిందని హైకోర్టు గుర్తు చేసింది. విజయభాస్కర్‌కు అనుకూలంగా పరిపాలన ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ.. అతడిని ఎస్సైగా నియమించే ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. ఈ తీర్పుతో 11 ఏళ్ల తర్వాత విజయభాస్కర్ తిరిగి ఉద్యోగంలో చేరనున్నారు.

కేసు వివరాలివీ..

2008లో నెల్లూరు జిల్లాకు చెందిన విజయభాస్కర్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. అయితే, అతడి నియామకాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2012లో ఓ మెమో జారీ చేసింది. అతడిపై నమోదైన కేసు వివరాలను దరఖాస్తులో పేర్కొనకుండా గోప్యంగా ఉంచారని, ఇది నిబంధనలకు విరుద్ధమని ప్రభుత్వం తెలిపింది. ఈ మెమోను సవాల్ చేస్తూ విజయభాస్కర్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్ ప్రభుత్వ మెమోను కొట్టేస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ప్రభుత్వం, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు 2012లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఇటీవల ఈ వ్యాజ్యంపై జస్టిస్ సోమయాజులు ధర్మాసనం తుది విచారణ జరిపి అతడిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 85
లేయర్ (లైవ్) : 75
బ్రాయిలర్ చికెన్ : 160
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 180
లేయర్ చికెన్ : 128

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.100
సన్నవి : రూ.85
పండ్లు : రూ.50